క్లుప్తంగా

ఘనంగా లక్షపత్రి పూజ



స్వామివారికి పూజలు చేస్తున్న జస్టిస్ శివశంకర్, పండితులు

అమలాపురం టౌన్: స్థానిక బాలత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్ష పత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో రాష్ట్ర జ్యూడీషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ బులుసు శివశంకర్ పాల్గొని ఆయనే స్వయంగా శివలింగానికి పూజలు చేశారు. గత 46 ఏళ్లుగా ఏటా ఈ పూజలు చేస్తున్నారు. స్వామివారికి లక్ష పత్రి పూజతోపాటు ఏకాదశ రుద్రాభిషేకం, రుద్ర హోమం, చండీ హోమం, శాంతి కల్యాణం వంటి కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో గాదె శ్రీనివాస్, ఆకెళ్ల భానుమూర్తి, యేడిద సుబ్రహ్మణ్యశర్మ, గుళ్లపల్లి వెంకట్రామ్, సామవేదం ఆదిత్యఘనాపాఠి, శిష్టా భాస్కర్, జేఎస్ దీక్షితులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామి ప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

రెండు మోటారు సైకిళ్లు ఢీ



గాయపడిన నవీన్‌ను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారుసైకిళ్లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పెట్రోలు బంక్ వద్ద ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. అయినవిల్లికి చెందిన వాసంశెట్టి నవీన్ మోటారు బైక్‌పై మురమళ్ల వైపు వెళుతుండగా ఐ.పోలవరం గ్రామానికి చెందిన షాహెబ్ డాక్టర్ స్కూటర్‌పై వస్తూ పెట్రోలు బంక్‌లోకి వెళ్లేందుకు 216 జాతీయ రహదారిని దాటుతుండగా రెండు మోటారుసైకిళ్లు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నవీన్‌కు తలపై బలమైన గాయం కాగా షాహెబ్ డాక్టర్ కాలుపై గాయమైంది. ఇద్దరిని 108లో ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. దీనిపై ఇంకా కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కాట్రేనికోన: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కామేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ పాలెపు లక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ నేలకిషోర్ విచ్చేస్తారన్నారు. సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

దేవగుప్తంలో గడప గడపకూ మన ప్రభుత్వం

అల్లవరం: దేవగుప్తంలో సోమ, మంగళవారాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సాధనాల వెంకటరావు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ హాజరై సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించనున్నారని తెలిపారు. అలాగే దేవగుప్తం ఎంపీపీ స్కూల్ వద్ద వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. మండల స్థాయి అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలన్నారు.

ధనుర్మాసంలో ప్రత్యేక పూజలు



భీమనపల్లిలో వేంకటేశ్వరస్వామి వారు

ఉప్పలగుప్తం: ధనుర్మాసం సందర్భంగా భీమనపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి విశేష పూజలు చేసి, లక్ష చామంతి పూలతో పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ సన్నిధిలో అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఫ్లెక్సీ వివాదం

అల్లవరం: మొగళ్లమూరు పంచాయతీ పరిధిలో గోగువారిపేటలో రెండు సామాజిక వర్గాల మధ్య ఆదివారం రాత్రి ఫ్లెక్సీ వివాదం చోటుచేసుకుంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన యువత సంక్రాంతి పండగ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. గోగువారిపేటకు వెళ్లే దారిలో ఫ్లెక్సీ పెట్టడంతో ఘర్షణ తలెత్తింది. దీంతో ఒక వర్గానికి చెందిన యువకుల నిరసన తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. సర్పంచ్ రాయుడు విష్ణు, ఏఎస్సై జె.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సాగుకు సాయం.. ఉపాధికి ఊతం



ఉప్పలగుప్తం పంట కాలువలో పూడికలు తీస్తున్న ఉపాధి కూలీలు

- రబీకి ఉపాధి హామీ పథకం చేయూత
- కూలీలకు ప్రత్యేక పని దినాలు
- జోరుగా సాగుతున్న పనులు

ఉప్పలగుప్తం: రబీ సాగుకు సహకారంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. పంట కాలువలు, బోదెలు, రెవెన్యూ డ్రైన్లు పూడికుపోవడంతో చేలల్లో నీరు దిగక సాగుకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్‌లో కూడా పంట వేయడానికి ఆసక్తి చూపడంలేదు. రైతాంగానికి సవాళుగా మారిన ముంపు సమస్య నుంచి కాపాడేందుకు డ్రైన్ల ప్రక్షాళనకు చర్యలు పూనుకున్నారు. డ్రైన్లలో పూడిక తీయడంతో పాటుగా రెవెన్యూ డ్రైన్లు, పంట కాలువ, బోదెల్లో పేరుకుపోయిన తూటు, గుర్రపుడెక్క తొలగింపు పనులను ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టి కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో పనులు చేపట్టడంతో రబీ సాగుకు ఆటంకాలు తొలగి రబీలో నాట్లు ముమ్మరంగా చేపట్టారు. రబీకి ముందుగానే ఈ పనులు చేపట్టడంతో ముంపు బెడద తీరి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధిలో కొన్ని కుటుంబాలకు పని దినాలు ముగిసినప్పటికీ ముందస్తుగా వచ్చే ఆర్థిక సంవత్సర పనిదినాలను ప్రత్యేకంగా కేటాయించి కూలీలకు అదనపు పని కల్పిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకూ జరిగే పనులపై 99 శాతం పనులు 3 నెలల ముందే పూర్తి అయినట్టు నివేదిక తెలుపుతోంది.

2022-2023 ఆర్థిక సంవత్సరంలో మండలాల వారీగా గుర్తించిన పనులు

మండలం	గుర్తించిన కాలువ పనులు	కేటాయించిన బడ్జెట్ (రూ.కోట్లలో)
అల్లవరం	251	3.51
ఉప్పలగుప్తం	119	3.66
ముమ్మిడివరం	110	0.73
ఐ.పోలవరం	267	4.25
కాట్రేనికోన	134	1.39
అమలాపురం	162	2.14
తాళ్లరేవు	900	4.70

ఇప్పటికే పని దినాలు పూర్తి



మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఈ ఆర్థిక సంవత్సరానికి పనులు దాదాపు ముగిశాయి. ఈ పనులు పూర్తి చేయడంలో జిల్లా ముందంజలో ఉంది, ఉప్పలగుప్తం మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో ఉంది. ఈ పని దినాలు ముగిసినప్పటికీ రైతులకు రబీ సాగుకు ఆటంకం లేకుండా ఉపాధి కూలీలచే పూడికలు తీయిస్తున్నాం. ఈ విధంగా పంటకు నీరు ఎగుమతి, దిగుమతిలు ఆటంకం లేకుండా ఉంటుంది.

–కేఎస్ గౌరీకుమారి, ఎంపీడీవో ఉప్పలగుప్తం మండలం

ప్రత్యేక పని దినాలు



ఉపాధి పథకంలో 100 రోజుల పని దినాలు పూర్తి చేసిన కుటుంబాలకు వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రత్యేక పని దినాలు కల్పిస్తున్నారు. ప్రత్యేక పని దినాలు కల్పించడం వల్ల ఉపాధి పథకంలో అదనపు ఆదాయం పొందుతున్నాం.

–నేతల కనకదుర్గ, దేవగుప్తం

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



ఎస్టీయూ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్

అమలాపురం టౌన్: స్థానిక మద్దాల వారిపేటలో ఆదివారం జరిగిన పట్టణ ఎస్టీయూ సమావేశం పలు ఉపాధ్యాయల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. పట్టణ శాఖ అధ్యక్షుడు ఎస్.గోపీరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎన్ఎస్ఎస్ శివప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మరో ముఖ్య అతిథిగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పీవీఎస్ రామారావు పాల్గొన్నారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థిక సమస్యలనూ పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నలి ప్రసాద్, జిల్లా అభయ్ కన్వీనర్ ఎస్ఎస్ పల్లంరాజు, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ చిక్కం మైనర్‌బాబు, యూనియన్ సీనియర్ నాయకులు ఎంఎస్ఎన్ మూర్తి, ఎంఎంకేజే మొయినుద్దీన్, కాశి వెంకట్రావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఆర్.దుర్గ తదితరులు ప్రసంగించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అల్లవరం: బోడసకుర్రు గౌతమీనగర్‌కు చెందిన జల్లి కుమార్‌దుర్గ(32) అప్పుల బాధలు భరించలేక గత నెల 17వ తేదీన కూల్‌డ్రింక్‌లో కలుపుమందు కలుపుకొని తాగి తన నివాసంలో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న కుమార్‌దుర్గని కాకినాడలో ఆపోలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సుమారు 20 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై అల్లవరం ఏఎస్సై శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కుమార్‌దుర్గ మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని వారు తెలిపారు. మృతుడుకి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు



విశ్రాంత ఉద్యోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాళ్లరేవు: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కాకినాడ సిటీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు సీహెచ్ చినబాబు విశ్రాంత ఉద్యోగులతోపాటు స్థానిక పేద ప్రజలకు బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలు చేశారు. అదే విధంగా 100 మంది విశ్రాంతి ఉద్యోగులకు యాన్యువల్ వెరిఫికేషన్ సర్టిఫికెట్లు(లైవ్ సర్టిఫికెట్) అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేవీవీ రామకృష్ణయ్య, ఏవీవీ సత్యనారాయణ, కోశాధికారి దడాల వెంకన్న, పుప్పాల కృష్ణమూర్తి, కడలి ప్రకాశరావు, పీవీ హనుమంతరావు, దడాల మంగాదేవి, సిటీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి టెక్నికల్ టీం హరికిరణ్, విజయ్, సంతోష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

తాళ్లరేవు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళ, బుధవారాల్లో పి.మల్లవరంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కుడిపూడి శివన్నారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక పెదపేటలో ఏర్పాట్లను ఎంపీపీ రాయుడు సునీత, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఎటువంటి జూదాలకు, అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన జట్లు పాల్గొంటాయని, పోటీలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ పోటీలకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు.

రైల్వేలైన్ సాధన పోరాటానికి సిద్ధం కావాలి



నిరసన తెలుపుతున్న కోనసీమ జిల్లా రైల్వే సాధన సమితి సభ్యులు

అమలాపురం రూరల్: దశాబ్దాల నుంచి ఎదురు చూస్తున్న కోటిపల్లి నరసాపురం రైల్వేలైన్ ఇప్పటికీ పట్టా లెక్కలేదని కోనసీమ రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో భట్నవిల్లి రైల్వే శిలాఫలకం వద్ద నిరసన తెలిపారు. కోనసీమ రైల్వే సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తక్షణం తమ వాటా 25 శాతం నిధులు మంజూరు చేయాలని రాజకీయ పార్టీలు కలిసి కట్టుగా రైల్వే లైన్ పూర్తిచేయడానికి కోసం కృషి చేయాలని అన్నారు. ఈ నెల జనవరి 22వ తేదీన అన్ని రాజకీయ పార్టీల, విద్యార్థి సంఘాలు ఉద్యమ సంఘాలతో కలిపి భట్నవిల్లి శిలా ఫలకం వద్ద సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కోనసీమ రైల్వే సాధన సమితి కన్వీనర్ బొంతు రమణ, రేవు, తిరుపతి రావు, కారెంవెంకటేశ్వరరావు బత్తుల సాయి, పంబల నాగేంద్ర, ఊటాల వెంకటేష్ మోకా శ్రీను, నల్లా చంద్ర, శెట్టి బత్తుల తులసీరావు, గెద్దాడ బుద్ధరాజ్, మెండి డేవిడ్,సాపే రమేష్, పోలమూరి వెంకట్, మెరమెల్ల శివ, నేల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ విష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆవిష్కరించారు. ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరి రావు ఆధ్వర్యంలో అమలాపురంలో క్యాంపు కార్యాలయంలో మంత్రి విశ్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎస్.రాధాకృష్ణ, టి.మురళీకృష్ణ, అంకం రంగారావు (పూలరంగాడు) తదితరులు పాల్గొని మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: బీమా భాయీ మహిళా మండలి ఆధ్వర్యంలో మండలంలోని ఐదు గ్రామాల్లో దివ్యాంగులు, వితంతువులు, రోగులు 450 మందికి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పౌష్టికాహార కిట్లు అందజేశారు. స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పొన్నాడ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నిరుపేదలు, వ్యాధి గ్రస్తులకు బీమా భాయి మహిళా మండలి ప్రతినిధులు వాశెంశెట్టి నందివర్ధన, వెంకట రమణ చేస్తున్న సేవలను కొనియాడారు. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ దొమ్మేటి శ్యామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత కుడిపూడి శివన్నారయణ, నందికోళ్ల శ్రీదేవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కోటిపల్లి -అన్నవరం బస్సుకు వినతి

అమలాపురం టౌన్: కోటిపల్లి నుంచి అన్నవరానికి ఆర్టీసీ బస్సు నడపాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను కోరుతూ ఎస్‌జేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం వినతి పత్రం అందించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి గతంలో కోటిపల్లి -అన్నవరం మధ్య బస్సు నడిపేవారని గుర్తు చేశారు. అన్నవరం, కోటిపల్లి రెండు చోట్లా పుణ్య క్షేత్రాలు ఉన్న దృష్ట్యా ఈ ప్రాంతాల మధ్య బస్సు గతంలో మాదిరిగా బస్సు నడిపితే భక్తులకు వెసులబాటుగా ఉంటుందని వివరించారు. జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, ఎస్‌జేపీ నాయకులు బొక్కా రామకృష్ణ, పాటి వెంకట్రామయ్య, మోర్త శ్యామ్, మట్టపర్తి సాయిబాబా మంత్రిని కలిశారు.

భోగి పిడకల విక్రయం



అమలాపురం టౌన్: సంక్రాంతి పండగకు కోనసీమ పెట్టింది పేరు. పండగ నెల రోజుల ముందు నుంచే సందడి మొదలవుతుంది. పండగ తొలి రోజు భోగి మంటల్లో పిడకలు వేస్తారు. వాటిని తయారు చేసేందుకు చిన్నారులు నెల రోజుల ముందు నుంచే పని మొదలు పెడతారు. ఆవు పేడతో పిడకలు తయారు చేసుకుంటారు. వాటిని ఎండబెట్టి దండలు కట్టి భోగి మంటల్లో వేస్తారు. అయితే వారికి అంత శ్రమ లేకుండా గ్రామాల్లో పట్టణాల్లో ఆవు పేడ పిడకలను తయారు చేసి కూరగాయల్లా ఇలా బళ్లపై పెట్టి విక్రయిస్తున్నారు. డోర్ డెలివరీ చేస్తున్నారు. ఈ దృశ్యం ఆదివారం అమలాపురం పట్టణంలో బి.భీమేశ్వరరావు అనే వ్యక్తి విక్రయిస్తుండగా సాక్షి కంట పడింది.

ఎన్.కొత్తపల్లిలో 'ఇదేం ఖర్మ'

ఉప్పలగుప్తం: ఎన్.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అమలాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ కార్యక్రమం జరిగింది. నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అసెంబ్లీ ఇన్‌చార్జి వనమాడి కొండబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కాలనీ ఆర్చ్ నిర్మాణానికి శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి

అమలాపురం టౌన్: స్థానిక 25వ వార్డులోని వడ్డెర కాలనీకి సీఎస్ఆర్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న ఆర్చ్‌కు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం ఉదయం శంకు స్థాపన చేశారు. వడ్డెర కాలనీ అభివృద్ధికి మంత్రి విశ్వరూప్ అవసరమైన నిధులు అందిస్తూ అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్నారని వార్డు కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, ఇన్‌చార్జి కమిషనర్ కొత్త అప్పలరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి, కౌన్సిలర్లు దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్, కట్టోజు సన్నయ్యదాసు, చిట్టూరి పెదబాబు, నాగారపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి విశ్వరూప్‌ను వార్డు తరఫున పార్టీ నాయకుడు దొంగ చిన్నా తదితరులు ఘనంగా సత్కరించారు.

విశ్వరూప్ మార్గ్ పనుల పరిశీలన : స్థానిక చిన్న వంతెనల నుంచి శ్మశానం చెంత నుంచి ఈదరపల్లి బైపాస్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ నిర్మితమవుతున్న విశ్వరూప్ మార్గ్ పనులను మంత్రి విశ్వరూప్ పరిశీలించారు. ఆ మార్గ్ కుమ్మరి కాల్వ గట్టు చెంత నుంచి నిర్మితమవుతున్న క్రమంలో ఆ గట్టును కూడా పరిశీలించి ఇన్‌చార్జి కమిషనర్ అప్పలరాజుకు పలు సూచనలు చేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే పొన్నాడ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో క్రరివానిరేవు సర్పంచ్ కాశి బాగ్యలక్ష్మి ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ పి.గంగాభవానీ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన సేవలను కొనియాడారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మత్స చిట్టిరాజు, కాట్రేనికోన జెడ్పీటీసీ నేల కిశోర్, కుడిపూడి శివన్నారాయణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ వడ్డి శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

55 ఏళ్ల తరువాత కలుసుకున్న విద్యార్థులు

ముమ్మిడివరం: వారంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా దూర ప్రాంతాలలో ఉన్నారు. అందరూ ఒక్క చోటకు చేరి సందడి చేశారు. దానికి స్థానిక రోటరీ కల్యాణ మండపం వేదికైంది. ముమ్మిడివరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1969–70లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులందరూ ఆదివారం రోటరీ కల్యాణ మండపంలో కలిశారు. గత స్మృతులను నెమరవేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. వారిలో ఉన్నత స్థితిలో ఉన్న కొంత మందిని ఘనంగా సత్కరించారు.

కొనసాగిన ఎమ్మెల్యే అశోక్ ఆమరణ దీక్ష

- అభిమానులు, నేతల నుంచి వెల్లువెత్తుతున్న మద్దతు
- పుదుచ్చేరి సీఎం రాక కోసం ఎదురుచూపులు



ఆమరణ నిరాహార దీక్ష శిబిరంలో ఉన్న ఎమ్మెల్యే అశోక్

యానాం: ప్రజా సమస్యలకు సంబంధించిన 15 డిమాండ్లను నెరవేర్చాలంటూ సీఎం రంగసామి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష ఆదివారం 3వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షా శిబిరానికి యానాంతోపాటు కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఆయన అభిమానులు, మద్దతుదారులు, పార్టీలకతీతంగా నేతలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్ర కళాదీప్తికుమారి మాట్లాడుతూ న్యాయబద్ధమైన, ప్రజోపయోగమైన డిమాండ్లను పుదుచ్చేరి ప్రభుత్వం నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఇళ్ల పట్టాలకు భూసేకరణ, జీజీహెచ్‌లో వైద్యపరికరాలు, ఆయుష్మాన్‌భారత్ అన్ని ఆసుపత్రుల్లో అమలు అయ్యేలా ఆరోగ్య కార్డులు, కోవిడ్‌తో చనిపోయిన వారికి రూ.50వేల సహాయం, మత్స్యకారులకు రావాల్సిన ఓఎన్‌జీసీ పరిహారం మధ్యవర్తులతో ప్రమేయం లేకుండా అందించడం, ఎస్సీ రైతాంగానికి ఓఎన్‌జీసీ సహాయం, సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు తదితర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. మరోవైపు యానాంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కాకినాడ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయకుమార్, కార్పొరేటర్లు కంపర బాబీ, నల్లబిల్లి సుజాత, నాయకులు చిట్నీడి మూర్తి, కత్తిపూడి శ్రీను, రాగిరెడ్డి సుబ్బారావు, గణపతి, ధూళిపూడి బాబీ, పిల్లిసత్తిబాబు, వైసిపి నేత చింతపల్లి వెంకటరెడ్డి, జి.వేమవరం సర్పంచ్ నల్లా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

క్షీణిస్తున్న అశోక్ ఆరోగ్యం : మూడో రోజు ఆమరణ దీక్ష చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ ఆరోగ్యం క్షీణిస్తుండడంతో ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యానాం ప్రజా ఉత్సవాల్లో పాల్గొనేందుకు పుదుచ్చేరి సీఎం రంగసామి ఆదివారం సాయంత్రం యానాం విచ్చేశారు. అయితే ప్రజాసమస్యలపై దీక్ష చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ వద్దకు వస్తారని, సమస్యలపై చర్చిస్తారని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

శిబిరాన్ని సందర్శించకుండా వెళ్లిన సీఎం

యానాం: యానం వచ్చిన పుదుచ్చేరి సీఎం రంగసామి ఎమ్మెల్యే అశోక్ దీక్షాశిబిరానికి రాకుండానే వెళ్లిపోవడం ఆయన అభిమానులను, కార్యకర్తలు, స్థానికులకు విస్మయానికి గురి చేసింది. యానాం ప్రజా ఉత్సవాలకు వచ్చిన సీఎం కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్లిపోయారు. కనీసం ఎమ్మెల్యే అశోక్ దీక్షాశిబిరానికి సందర్శించకుండా వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. ఉదయం నుంచి ఎంతో ఆశగా చూసినప్పటికీ సీఎం రాకపోవడం దారుణమని, పుదుచ్చేరి అసెంబ్లీ సభ్యుడిపై ఉన్న గౌరవంతోనైనా వస్తారని అనుకున్నామని పలువురు నాయకులు పేర్కొన్నారు.

యానాం అభివృద్ధికి పూర్తి సహకారం

ప్రజా ఉత్సవాల ముగింపులో సీఎం రంగసామి



ప్రజా ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రంగసామి, మల్లాడి, పుదుచ్చేరి ఎమ్మెల్యేలు

యానాం: యానాం అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందిస్తానని గతంలో కోట్లాది రూపాయిల ఖర్చుతో వివిధ నిర్మాణాలు జరిగాయని పుదుచ్చేరి సీఎం రంగసామి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి యానాం ప్రజా ఉత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత వసతులే లేని యానాం నియోజకవర్గాన్ని పుదుచ్చేరిలోనే ఆదర్శ నియోజకవర్గంగా మార్చానని అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిధులతో జిప్‌మెర్ ఆసుపత్రి, ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ, ఆయుష్ ఆసుపత్రి తదితర నిర్మాణం జరుగుతున్నాయన్నారు. యానాంలో అభివృద్ధి లేదని శాసనసభ్యుడు అశోక్ అనడం తనకు బాధగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పుదుచ్చేరికి ఇచ్చే నిధులను బట్టి యానాంకు కేటాయింపులు ఉంటాయని సీఎం రంగసామి పేర్కొన్నారు. యానాంకు సంబంధించి అనేక పనులు జరగడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ యానాంకు సంబంధించి సమస్యలు గురించి రంగసామి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజాఉత్సవాల ప్రాధాన్యం గురించి వివరించారు. ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, మున్సిపల్ కమీషనర్ ఖండవల్లి రామకృష్ణ, పుదుచ్చేరి ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.